క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛంగా ఉంచాలి

జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రతతో మన ఊరిని, రాష్ట్రాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. స్వచ్ఛతాహిసేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జెడ్పీ అధికారులు, ఉద్యోగులతో కలిసి హెనీ క్రిస్టినా జెడ్పీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఆవాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మన ఊరు, మనరాష్ట్రం దేశాన్ని స్వచ్ఛభారత్‌గా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు, అకౌంట్స్ అధికారి జి.శ్రీనివాసరావు, జెడ్పీ ఏవోలు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమంపై ఆర్యవైశ్యుల హర్షం

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి వారి దేవస్థానంలో మంగళవారం దసరా నవరాత్రి ఉత్సవ నిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారిక కార్యక్రమంగా నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వరప్రసాద్ బాబు, గౌరవ సలహాదారులు వనమా నరేంద్ర, కొనకళ్ళ సత్యం కన్వీనర్లు కోటా శేషగిరి, నేరెళ్ల హరిప్రసాద్, కారంశెట్టి లోకేష్, బేల్ది రాంబాబు, దేవరశెట్టి సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో చతుర్ధశి, పౌర్ణమి సందర్భంగా మంగళవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఆలయ కమిటి అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆముక్తమాల్యదపై ప్రవచనం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం ఆముక్తమాల్యద ధారావాహిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి మాట్లాడుతూ శ్రీరంగని పదసన్నిధి అనే పెన్నిధిని పొందిన యామునాచార్యుడు ఇహలోకపు నిధుల మీద, భోగభాగ్యాల మీద విరక్తి పొందాడన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

పట్నంబజారు: దివంగత నందమూరి తారక రామారావు విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం బ్రాడీపేట 6వలైనులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఉదయం చూసిన కొంత మంది టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతం కంటే మానవత్వమే గొప్పది



గుంటూరు మెడికల్: మతం కంటే మానవత్వమే గొప్పదని హోప్ విన్ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. గుంటూరు రూరల్ మండలం, ఓబులనాయుడుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఓబుల నాయుడు పాలెం గ్రామ మాజీ సర్పంచ్ చింతా సుబ్బారావు ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి డాక్టర్ షమ సుల్తాన ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూనపురెడ్డి శ్రీనివాసరావు, దేగల గణేష్, చొప్పా సుధీర్, హోప్ విన్ హాస్పిటల్స్ సిబ్బంది, స్వామివారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తింటే గుడ్లు తేలేయాల్సిందే!!

- అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు
- కాంట్రాక్టర్ల కక్కుర్తితో నాసిరకం పౌష్టికాహారం పంపిణీ
- కొద్దిరోజుల క్రితం గుంటూరు అర్బన్ లో కుళ్లిన కోడిగుడ్లు చూసి షాకైన లబ్ధిదారులు
- పౌష్టికాహారం కూడా సక్రమంగా పంపిణీ చేయని వైనం
- పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు

పౌష్టికాహార పంపిణీ ఓ అత్యద్భుతమైన కార్యక్రమం. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఈ పౌష్టికం ఇవాళ అందర్నీ ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. కాంట్రాక్టర్ల కక్కుర్తి, యంత్రాంగం పర్యవేక్షణ కొరవడటం.. వెరసి వీటిని పుచ్చుకుంటున్న వారిని నివ్వెరపరుస్తోంది. వీటిని ఎందుకు పంచుతున్నారో.. అసలు దీని లక్ష్యమేమిటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి గుంటూరు నగరంలో నెలకొంది.

నెహ్రూనగర్: గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం పంపిణీలో కాంట్రాక్టర్లు చేతి వాటం చూపిస్తున్నారు. వారికి మెరుగైన పౌష్టికాహారం పంపిణీ చేయాల్సి ఉండగా.. నాసిరకం పౌష్టికాహారం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని తూర్పు నియోజకవర్గంలో ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు చూసి లబ్ధిదారులు గుడ్లు తేలేసినంత పనైంది ఈమధ్యన. అసలు, బాలింతలకు, చిన్నారులకు ఇటువంటి పౌష్టికాహారం సరఫరా చేస్తారా అంటూ మండిపడుతున్నారు.

కాంట్రాక్టర్ల కక్కుర్తితో...

గుంటూరు జిల్లాలో 1480 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1463 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 17 మినీ సెంటర్లు, ఇందులో 0 నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలు 53,541 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 17,715, గర్భవతులు 10,087, బాలింతలు 8258 మంది ఉన్నారు. వీరికి



కుళ్లిపోయిన కోడిగుడ్డు

పౌష్టికాహారం పంపిణీ చేసే కాంట్రాక్టర్ కక్కుర్తితో నాసిరకం ఆహారం పంపిణీ చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్‌తో లాలూచి పడి వారి వద్ద నుంచి ముడుపులు తీసుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గత ప్రభుత్వంలో పక్కాగా పౌష్టికాహారం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం రాగిపిండి 1 కేజీ, జొన్న పిండి 1 కేజీ, కోడిగడ్లు 25, బాలమతం రెండున్నర కేజీ, రెండున్నర లీటర్ల



కోడిగుడ్డు పగలగొట్టిన తరువాత దానిలో కుళ్లిన కోడిగుడ్డు సొన

పాలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, ఖర్జూర 250 గ్రాములు, చిక్కి 250 గ్రాములు, కందిపప్పు 1కేజీ, బియ్యం 3 కేజీలు, అర కేజీ నూనె ఇచ్చేవారు.. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జొన్నపిండి ఆపేసి రాగిపిండి రెండు కేజీలు, కోడిగుడ్లు 25, బాలమృతం రెండున్నర కేజీ, రెండున్నర లీటర్ల పాలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, ఖర్జూర 250 గ్రాములు, చిక్కి 250 గ్రాములు, కందిపప్పు 1 కేజీ, బియ్యం 3 కేజీలు, అర కేజీ నూనె ఇస్తున్నారు. అది కూడా సక్రమంగా ఇస్తున్నారే అంటే అది లేదు... 30 మంది లబ్ధిదారులు ఉంటే 15 మందికి ఇచ్చి చేతులు దూలుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎందుకు మాకు ఇవ్వడంలేదని ఎవరైనా అడిగితే ప్రభుత్వం సరిపడా పంపడం లేదని అంగన్‌వాడీ సిబ్బంది చెప్పడం గమనార్హం.

కందిపప్పు ఇచ్చి మూడునెలలైంది

గర్భవతులు, బాలింతలకు ఇచ్చే కందిపప్పు 3 నెలల నుంచి ఇవ్వడం లేదు. ఈ నెలలో నూనె కూడా ఇవ్వని పరిస్థితి. ఆ ఇచ్చే పౌష్టికాహారం కూడా నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారంటూ లబ్ధిదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

పౌష్టికాహారం పక్కదారి

లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టిస్తున్నారే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కోడిగుడ్లు బేకరీలకు, పాలు, అటుకులు కూడా అంగన్‌వాడీ సిబ్బంది అమ్ముకుంటున్నట్లు సమాచారం. ప్రతి నెల ఇవ్వాల్సిన దాని కన్నా తక్కువ పౌష్టికాహారం పంపిణీ చేయడంపై కొంతమంది లబ్ధిదారులు అధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

పొంతనలేని సమాధానాలు!

గుంటూరు అర్బన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిపోయిన కోడిగుడ్లు సరఫరా జరుగుతోందన్న విషయాన్ని సాక్షి ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి దృష్టికి తీసుకువెళ్లగా.. ఏ సెంటరో చెబితే అక్కడికి వెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.. అర్బన్ సీడీపీఓ కృష్ణవేణిని వివరణ కోరగా గర్భవతులు, బాలింతలకు కోడిగుడ్లు ఇంటికే పంపిస్తుంటాం.. వారు కొన్ని రోజుల తరబడి నిల్వ ఉంచితే కుళ్లిపోయే పరిస్థితి ఉందని తాపీగా సమాధానం చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికాస్ నగర్‌లోని రెండోలైనులో ఉన్న ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే చీకటి మణికంఠకు కొన్నేళ్ల క్రితం తిరుమల (29)తో వివాహం జరిగింది. పెళ్లి అయిన తరువాత నిత్యం భార్య తిరుమలను అనుమానంతో మణికంఠ వేధిస్తుండేవాడు. వేధింపులకు గురిచేయడంతోపాటు, ఇబ్బంది పెడుతుండటంతో మనస్తాపానికి గురైన తిరుమల ఆమె నివాసంలోనే ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు నగరంలో కమ్యూట్ ఆన్ సైకిల్ డే

నెహ్రూనగర్: స్వచ్ఛత హి సేవ లో భాగంగా గురువారం నిర్వహించే కమ్యూట్ ఆన్ సైకిల్ డే ప్రత్యేక కార్యక్రమంలో ప్రజలు తమ దిన చర్యలో కేవలం సైకిల్ మాత్రమే వినియోగించి కార్యక్రమ విజయవంతంలో భాగస్వాములు కావాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటన కోరారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా అక్టోబర్ 2 వరకు ప్రతి రోజు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ఒక ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేశామని, ఈ క్రమంలో భాగంగా ఈ నెల 19న కమ్యూట్ ఆన్ సైకిల్ డే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది మోటార్ వాహనాలు కాకుండా సైకిల్ మీద మాత్రమే విధులకు హాజరవుతారన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదాం...

- ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- వేర్వేరు ప్రాంతాల్లో కార్యక్రమాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రజారోగ్య కార్మికుల మస్టర్ పాయింట్స్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, వార్డ్ సచివాలయాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత భాగస్వామ్యంతో సుమారు 1.25 లక్షల మందితో స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞను చేపట్టారు. అనంతరం స్వచ్ఛత హి సేవ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయంలో

గుంటూరు మెడికల్: మహాత్మగాంధీ స్వచ్ఛత, అభివృద్ధి గురించి ఆకాంక్షించారని డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా డాక్టర్. విజయలక్ష్మి ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిబ్బంది చేత ప్రమాణం చేయించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్. అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ బి. లక్ష్మానాయక్, డిస్ట్రిక్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ ప్రియాంక, సుబ్బరాయణం, జయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత కోసం పాటుపడాలి

లక్ష్మీపురం: ప్రభుత్వ కార్యాలయాన్ని అందంగా, పరిశుభ్రంగా ఉంచడంలో ఉద్యోగులందరూ స్వచ్ఛత దిశగా కొంత సమయాన్ని కేటాయించుకోవాలని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సూచించారు. స్థానిక కన్నవారి తోటలో సెంట్రల్ జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవం నిర్వహించారు. ముందుగా స్వచ్ఛత హి సేవ పై కమిషనర్ సాధు నరసింహారెడ్డి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐ ఆర్ ఎస్ అధికారులు బి.లక్ష్మినారాయణ, ఎం.నాగరాజు, బి.రవికుమార్, వి.సచ్చిదానంద సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, టి.వి.జి.కే మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ..

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులచే స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగరపాలకసంస్థ ఎంహెచ్‌వో జె. రామారావు తదితరలు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

గ్రామస్థాయిలో నిర్వహణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాలను అక్టోబర్ ఒకటో తేదీ వరకు నిర్వహించేందుకు జెడ్పీ సీఈవో ఎన్ఎస్వీబీ వసంత రాయుడు మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ విడుదల చేసిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రోజువారీ కార్యక్రమాలతో పాటు అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ వేడుకలను నిర్వహించి, కార్యక్రమ వివరాలతో పాటు ఫోటోలను స్వచ్ఛతాహి సేవ.జీవోవీ.ఇన్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఎల్‌పీవోలు, మండలస్థాయిలో ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, డ్వాక్రా సభ్యులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. షెడ్యూల్‌లో పొందుపర్చబడిన ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి మండల, జిల్లాస్థాయిల అధికారులకు తప్పనిసరిగా పంపాలని స్పష్టం చేశారు.

అత్యధిక స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అసెంబ్లీల సమీక్ష సమావేశం మంగళవారం గుంటూరు లాలుపురం రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, బీజేపీ సభ్యత్వ నమోదు కోస్తా జోన్ ఇంచార్జీ వల్లూరు జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని సభ్యత్వ నమోదు సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీకి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో అసెంబ్లీ సభ్యత్వ ఇన్‌ఛార్జ్ లు ఈదర శ్రీనివాసరెడ్డి, చెరుకూరి తిరుపతిరావు, చరకా కుమార్ గౌడ్, పాండురంగ విఠల్, విజయభాస్కర్ రెడ్డి, గారపాటి పూర్ణచంద్రరావు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపారాణీ, ఈమని మాధవరెడ్డి, పద్మనాభం, నేరెళ్ళ మాధవరావు, కారంశెట్టి రమేష్, మంత్రి సుగుణ, ఏలూరిలక్ష్మీ, మేరీ సరోజినీ, నాగమల్లీశ్వరి యాదవ్, ధార్మిక ప్రసాద్, దుర్గాప్రసాద్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ, వేదికపై వనమా నరేంద్రకుమార్, నాయకులు

నగరంపాలెం: సకల చరాచర సృష్టికి మూల కారణం విశ్వకర్మ భగవానుడని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. విశ్వకర్మ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా అమరావతిరోడ్డు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మ ధ్వజాన్ని ఎగురవేయగా, అనంతరం విశ్వకర్మ యజ్ఞం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు సృష్టించిన పంచ వృత్తుల ద్వారా విశ్వబ్రాహ్మణ వంశీయులు అనాది నుంచి నాగరిక సమాజానికి చేస్తున్న సేవలు నిరూపమానమని పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ రామస్వామి జయంతి

నెహ్రూనగర్: పెరియార్ రామస్వామి జయంతి వేడుకలు గుంటూరు నగరంలో వివిధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో యానాది కాలనీలో పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కులవ్యవస్థ నిర్మూలన కోసం ఆహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జూపూడి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు(వైకే), జీఆర్ భగత్ సింగ్, పీవీ రమణయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. శూద్ర, అతిశూద్ర విముక్తి ఉద్యమాలను బలోపేతం చేసిన పెరియార్ రామస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సమానత్వం కోసం, బడుగు,



రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూపూడి శ్రీనివాసరావు, వైకే, భగత్‌సింగ్

బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం వారి అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పెరియార్ రామస్వామి అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. రామస్వామి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోలా అశోక్, నాగూల్‌మీరా, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి

లక్ష్మీపురం: మానవ తప్పిదాల వల్ల పుడమికి రక్షణ కవచంలా ఉండవలసిన ఓజోన్ పొర నేడు పలచబడి పోతుందని ఓ జోన్ రక్షణ కవచాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత మొత్తం మావనాళిపై ఉందని పర్యావరణ ఉద్యమ నేత పి.సత్యన్నారాయణ మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సీనియర్ ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ మానవ విధ్వంసమే ప్రధమ కారణమని శాస్త్రవేత్తలు ఘంటా పథంగా చెబుతూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నగరంపాలెం: వరద బాధితులకు గుంటూరు మెడికల్ కళాశాల 1990వ బ్యాచ్ విద్యార్థులు తమ వంతుగా సహాయం అందించారు. విజయవాడ చల్లపల్లి మండలం అముద్రలంక గ్రామంలో నష్టపోయిన వారిలో సుమారు 500 మంది కుటుంబాలకు మంగళవారం బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు టవళ్లను పంపిణీ చేశారు. ప్రజలు తమ మనోధైర్యాన్ని పోగొట్టుకోకుండా ధైర్యంగా ఉండాలన్నారు.

కన్నుల పండువగా గ్రాండ్ పేరెంట్స్ డే

గుంటూరు ఎడ్యుకేషన్: అనుభవాలను రుచి చూసి, కష్ట, నష్టాలను చవిచూసి, పిల్లల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలను గౌరవించే సంప్రదాయమైన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు మంగళవారం లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా నాయనమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు వారి మనవడు, మనవరాళ్లతో వయసును పక్కనపెట్టి సరదా ఆటలాడారు. చిన్నారులతో కలసి ర్యాంప్ వాక్, అలనాటి గొప్ప ఆణిముత్యం మాయాబజార్‌లోని అహనా పెళ్ళంట గీతానికి అభినయించి అందరి మనసులను ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ మంచి, చెడుల విచక్షణతో విలువలు, సంప్రదాయాలు నేర్పేందుకు మన పెద్దలే మూల



గీతానికి అభినయిస్తున్న చిన్నారులు

స్తంభాలు అని, అటువంటి పెద్దలను ఎల్లప్పుడూ గౌరవించాలని తెలియచేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు పాటిబండ్ల నరేంద్రనాథ్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ శ్రీదేవి, దుర్గాశ్యామ్, ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్ధమాన మేనేజర్లతో కార్పొరేట్ అంచనాలు

ఈపీ ఫ్యూయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ దేశిరాజు రవి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో కార్పొరేట్ సంస్థలు వర్ధమాన మేనేజర్ల నుంచి పలు ముఖ్యమైన అంచనాలు పెట్టుకున్నాయని ఈపీ ఫ్యూయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దేశిరాజు రవి పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అతిథి ఉపన్యాసమిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ డాక్టర్ సింగరాజు వెంకటరమణ మాట్లాడుతూ తల్లిదండ్రులతో పాటు గురువులు, విద్యార్థులకు భవిష్యత్తుపై ఎన్నో అంచనాలు ఉంటాయని, అదే విధంగా



కార్పొరేట్ ఉద్యోగాలను కల్పించే సమయంలో కొన్ని అంచనాలు కలిగి ఉంటాయని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచానికి తగిన మేనేజర్లను తయారు చేసేందుకు అవసరమైన శిక్షణ తమ కళాశాల విద్యార్థులకు అతిథి ఉపన్యాసాలు, వర్క్ షాప్స్, మాక్ ఇంటర్వ్యూలు, క్షేత్రస్థాయి సందర్శనలతో విజ్ఞానాన్ని పెంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి. కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, వేదవతి, బాజీబాబు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఓజోన్ పొర పరిరక్షణపై టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అంతర్ కళాశాలల పోటీల్లో గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు తెలిపారు. మంగళవారం సంగడిగుంటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో భాగంగా బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న వి.పూజిత ద్వితీయ బహుమతి, కన్సొలేషన్ బహుమతి పొందిన జీఎల్‌వీ అంజనను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని, వాతావరణ కాలుష్యం ద్వారా ఓజోన్ పొరకు వాటిల్లుతున్న నష్టంతో మానవాళికి జరుగుతున్న చేటుపై సామాజిక స్పృహతో పోటీల్లో రాణించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ కోశాధికారి చందోలు జయప్రకాష్, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. మల్లిఖార్జునపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక ఎదుగుల లోపాలను నివారించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈసందర్భంగా బీ. ఫార్మసీ, ఫార్మా.డి విద్యార్థులకు ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, యూహెచ్‌సీ సూపర్‌వైజర్ సీహెచ్ మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది

నెహ్రూనగర్: గాంధీ పార్కులో సెక్యూరిటీ గార్డ్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతంలో కోతలు విధిస్తూ ఏజెన్సీ నిర్వాహకులు ఉద్యోగులను తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియర్ అధ్యక్షులు మధుబాబు, ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేడిద బాబురావు ఆరోపించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ ఎం.శ్యాంసుందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ పార్కులో 14 మంది సెక్యూరిటీ గార్డ్స్ పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం 15 వేలు ఉండగా, ఏజెన్సీ వారు రూ.10 వేలు మాత్రమే వారికి జీతంగా ఇస్తున్నారని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. అది కాక వారానికి, పది రోజులకి వివిధ కారణాలను చూపి కొంత మందిని విధుల నుంచి తొలగించి కొత్తవారిని నియమించుకుంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సిబ్బంది తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తగిన వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించే విధంగా ఏజెన్సీకి తగు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.